గోరింటాకు మహోత్సవం

మల్లాపూర్: ఆషాఢమాసం సందర్భంగా అవని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంద్రానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 5 నెలలు నిండిన గర్భిణీలకు గోరింటాకు పెట్టారు. వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి, అనంతరం పసుపు, కుంకుమ, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. నర్సింగ్‌గౌడ్, పరమేశ్వరి, అర్చన అగర్వాల్, వాలి, అంగన్‌వాడీ టీచర్ స్వాతి, మాధవి, బాలమణి, గర్భిణీలు పాల్గొన్నారు.

అమ్మవారి ఘటం ఊరేగింపు



గౌతంనగర్: మల్కాజిగిరిలో అమ్మవారి బోనాల పర్వదినం సందడి మొదలైంది. జంటనగరాల్లో ఇప్పటికే బోనాల పండుగ కనుల పండువగా భక్తులు నిర్వహించుకుంటున్నారు. ఈనెల 28న మల్కాజిగిరిలో బోనాల వేడుకలకు సర్కిల్ పరిధిలోని అన్ని ఆలయాలు ముస్తాబు కానున్నాయి. గురువారం సాయినగర్ పురవీధుల్లో అమ్మవారి ఘటాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయం, సంతోష్‌నగర్‌లోని అంబా భవాని ఆలయంతోపాటు ఉత్తంనగర్‌లోని దుర్గా జ్యోతిష్యాలయంలో ఆషాడమాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు శాకాంబరిగా దర్శనమిచ్చారు.

కబ్జాపై చర్యలేవి..?

కుంచించుకుపోయిన సుద్ధకుంట చెరువు
పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయిన వైనం
పట్టించుకోని సంబంధిత అధికారులు



పిచ్చి మొక్కలు చెత్తా చెదారంతో నిండి ఉన్న సుద్ధకుంట

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సుద్ధకుంట చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంది. ఒకప్పుడు సాగునీరు అందించిన సుద్ధకుంట పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో నిండిపోయింది. ప్రస్తుతం ఉన్న కుంట కేవలం ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగునీరు వెళ్లేందుకు కాల్వగా మాత్రమే ఉపయోగపడుతుంది. సుద్ధకుంటను సుందరీకరించి, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పిన అధికారులు, పాలకవర్గం ఆ దిశగా అడుగులు వేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

13.37 ఎకరాల్లో విస్తీర్ణం..

బోడుప్పల్‌లోని సుద్ధకుంట చెరువు మొదట 13.37 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. సుమారు 50 ఎకరాలకు సాగునీరు అందించింది. కాలక్రమేణ వ్యవసాయ భూములను లే అవుట్‌లు చేసి కాలనీలుగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న భూములు లేఅవుట్‌లోకి పోయాయి. 2010లో అప్పటి ఘట్‌కేసర్ రెవెన్యూ అధికారులు, హైదరాబాద్ డివిజన్ ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సర్వేచేసి సుద్ధకుంటకు హద్దులు ఏర్పాటు చేశారు.

- అధికారులు ఏర్పాటు చేసిన హద్దుల్లో సుద్ధకుంట 6.24 గుంటల్లో ఉన్నట్లు నిర్ధారించగా.. అందులో కొంత భాగం కబ్జాకు గురైంది. కాగా ప్రస్తుతం ఉన్న కుంటలో పిచ్చి మొక్కలు, చెత్త చెదారంతో నిండి ఉండగా.. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు, మురుగునీరు వెళ్లేందుకు కాల్వ మాత్రమే కనిపిస్తుంది.

ప్రమాదకరంగా ద్వారకానగర్ బ్రిడ్జి..

బోడుప్పల్ నుంచి ద్వారకానగర్ వైపు వెళ్లేందుకు సుద్ధకుంట కాల్వ వద్ద ఏర్పాటు చేసిన బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. కేశవనగర్, గాయత్రీనగర్, ఆంజనేయనగర్, లక్ష్మీనగర్ కాలనీవాసులు ఉప్పల్‌కు ఈ బ్రిడ్జి మీదుగా వెళ్తారు. ఇటీవల బోడుప్పల్‌లోని రా చెరువు నుంచి ద్వారకానగర్ బ్రిడ్జి వరకు వరదనీరు, మురుగు వెళ్లేందుకు నాలా పనులు చేపట్టారు. గతంలో ద్వారకానగర్ వద్ద ఉన్న బ్రిడ్జిని కూల్చివేసి ఎత్తు తగ్గించి పునర్నిర్మించారు.

- ఓ వైపు బ్రిడ్జికి నాలా ఉండగా.. బ్రిడ్జికి మరోవైపు 20 అడుగుల ఎత్తు లోయగా ఉందని, ఎలాంటి రిటర్నింగ్ వాల్ నిర్మించలేదని, దీంతో నిత్యం కాలనీవాసులు ప్రమాదాల భారినపడే అవకాశం ఉంది.

వాగ్దానాలు అమలు చేయాలి...

గత నగర పాలక సంస్థ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు చేసిన వాగ్దానాలు అమలు చేయాలి. ఎన్నికల్లో తమను గెలిపిస్తే సుద్ధకుంటను సుందరీకరించి, వాకింగ్ ట్రాక్, మొక్కలను ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేశారు. ప్రస్తుతం సుద్ధకుంట చెత్త, చెదారం, పిచ్చి మొక్కలతో నిండి దుర్వాసన వెదజల్లుతోంది.
- శ్రీనివాసులురెడ్డి, బోడుప్పల్



ప్రమాదకరంగా ద్వారకానగర్ మినీ బ్రిడ్జి ఇలా..

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయాలని వినతి



తాహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన బీజేపీ నేతలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకానికి అర్హులైన వారికి మంజూరైన చెక్కులను వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ నాయకులు మండల తాహసీల్దార్ సీతారామ్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగరాజు, నర్సింహాగౌడ్‌లు మాట్లాడుతూ.. పేదింటి ఆడపిల్లలకు ఉపయోగపడే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంలో భాగంగా మల్కాజిగిరిలో చెక్కులు ప్రభుత్వం నుంచి వచ్చినా పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. అధికారులు వెంటనే లబ్ధిదారులకు చెక్కులను అందజేయాలని కోరామన్నారు. నవీన్, ఆనంద్, సంతోష్, విఠోబా, సత్యనారాయణ, ధనలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో నివాసముంటున్న ముగ్గురికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. కృపా కాంప్లెక్స్ ప్రాంతానికి చెందిన నరేందర్‌కుమార్‌కు రూ. 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు, నర్సింహారెడ్డినగర్‌కు చెందిన సాకేత్‌కుమార్‌కు రూ. 24 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు, ఓల్డ్ మల్కాజిగిరికి చెందిన లక్ష్మికి రూ.1,50,000ల ఎల్‌ఓసీ లేఖను అందజేశారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, నాయకులు సూరి, బాలకృష్ణ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల చెరువులో గుర్రపు డెక్క తొలగింపు



ఉప్పల్ నల్ల చెరువు

ఉప్పల్ : ఉప్పల్ నల్ల చెరువులో కొన్నేళ్లుగా పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను ఉప్పల్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రారంభించారు. రెండు యంత్రాలను రంగంలోకి దింపి పనులను నిర్విరామంగా చేపడుతున్నారు. దాదాపుగా 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఉప్పల్ నల్లచెరువు పూర్తిగా గుర్రపు డెక్కతో పేరుకుపోగా.. స్థానికుల ఫిర్యాదుతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెరువుల్లో గుర్రపు డెక్కపై గత అసెంబ్లీ సమావేశాల్లో సమస్యను లేవనెత్తారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు. గతంలో డ్రోన్ల సాయంతో ఒక రకమైన మందును పిచికారీ చేయడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో అధికారులు డ్రోన్లకు స్వస్తి పలికారు. నేరుగా యంత్రాల సాయంతో గుర్రపు డెక్కను తొలగించారు.

నాయకులు పైరవీకారులుగా మారొద్దు

ఎంపీ ఈటల రాజేందర్

రామంతాపూర్: రాజకీయ నాయకులు పైరవీకారులుగా మారొద్దని ప్రజలకు సేవచేసేలా రాజకీయాలు ఉండాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం రామంతాపూర్ ఇందిరా ఇంపీరియల్ గార్డెన్‌లో జరిగిన అంబర్‌పేట్, రామంతాపూర్ ఆర్యవైశ్య సంఘం శ్రీ వాసవీకన్యకాపరమేశ్వర టెంపుల్ ట్రస్ట్‌కు అధ్యక్షుడిగా బోనగిరి శ్రీనివాసులు గుప్తా, ప్రధాన కార్యదర్శిగా గట్టు ప్రకాష్ గుప్తా, కోశాధికారిగా పూరి నగేష్ గుప్తా, సహాయ ప్రధాన కార్యదర్శిగా కొండయ్య గుప్తా, సహాయ కోశాధికారిగా శ్రీనివాస్ గుప్తా న్యాయ సలహాదారు పెండ్యాల సతీష్ గుప్తాతో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు ప్రచార కార్యదర్శులుగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకరానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ ఫెడరేషన్‌తో పాటు రాష్ట్రంలోని ఆర్యవైశ్య సంఘాలు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. ఈ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి ఇతర సామాజిక వర్గాల్లో ఉన్న పేద బలహీన వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి సంఘం వ్యవస్థాపక ఫౌండర్ చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా, ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్లు బండారు శ్రీవాణి వెంకటరావు, కక్కిరేణి చేతన హరీష్, బిక్షపతి గుప్తా, రమేష్ గుప్తా, రామచంద్ర గుప్తా, శ్రవణ్‌కుమార్ గుప్తా, పాండయ్య గుప్తా, లక్ష్మణ్, ప్రసాద్, సాయికిరణ్, ఉప్పల స్వప్న, మంజుల, శంభు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్



అధికారుల పర్యటన

అల్వాల్: అల్వాల్ చిన్నరాయుని చెరువులో మురుగు కలవకుండా పైపులు వేసేందుకు ఇరిగేషన్ అధికారులు, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డిలు ఎఫ్‌టీఎల్‌ఆర్ ప్లాట్స్ మార్గాన్ని గురువారం పరిశీలించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పైపులను ఎఫ్‌టీఎల్ ప్లాట్స్ నుంచి కాకుండా రోడ్డు మధ్య నుంచి వేయాలని వారు అధికారులకు సూచించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఇరిగేషన్ విభాగం డీఈ నరేంద్రకుమార్, ఏఈ మణికంఠ, ఏఈ పృథ్వీ, ఏఎంహెచ్ఓ మంజుల, నాయకులు మల్లేష్‌గౌడ్, రాజు, గిరి, ప్రేమ్‌కుమార్, కన్నాగౌడ్, రహమత్‌ఖాన్, సాజిత్, కాలనీవాసులు హరిబాబు, శ్రీధర్, ఉమేష్, గౌరీశంకర్, వెంకటేష్, శ్రీనివాస్, రాంచందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా సమస్య రాకుండా చర్యలు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో 'లో ఓల్టేజీ' సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం డివిజన్ పరిధిలోని నవోదయ కమ్యూనిటీ హాల్ వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రికల్ పోల్స్ పనులను స్థానికులతో కలిసి పర్యవేక్షించారు. జూన్ నెలలోనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేశాయని దానికి అనుసంధానంగా విద్యుత్ పోల్స్ వేస్తున్నామని, దీంతో డివిజన్‌లో చాలా వరకు లో ఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. బీఆర్‌ఎస్‌నేత బన్నాల ప్రవీణ్, బాలేందర్, రాజ్‌కుమార్, నర్సింగ్, కుమార్, సంతోష్ తదితరులున్నారు.



పెండింగ్ పనులు పూర్తి చేయండి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రోటోకాల్ పాటించడంపై అధికారులు భిన్న వైఖరిని అవలంభిస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకుని ప్రజలకు కనీస అవసరాలైన యూజీడీ, తాగునీటి పైపులైన్ల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆల్వాల్ కార్పొరేటర్ విజయశాంతి ఉన్నారు.

రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టండి..

నీటి ఎద్దడిని తీర్చేందుకు నూతన రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌ను కోరారు. మల్కాజిగిరిలో ఎత్తుగా ఉన్న ప్రాంతాలైన మల్లికార్జుననగర్, ఐఎన్‌నగర్ ప్రాంతాల్లో నూతనంగా 5 ఎంఎల్‌ఆర్‌సీసీ, జీఎస్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని కోరామన్నారు.



ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే మర్రి

పెండింగ్ పనులు ప్రారంభం

మౌలాలి: హనుమాన్‌నగర్ సీసీ రోడ్డు పనులను మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ ఏఈ మధురిమతో కలిసి పునః ప్రారంభించారు. రెండేళ్ల క్రితం రూ.80 లక్షలతో అప్పటి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మౌలాలి కార్పొరేటర్ కోరిక మేరకు నిధులు మంజూరు చేయించారు. జనవరిలో ప్రారంభించి, సగం మేర సీసీ రోడ్డు పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపేశారు. ఎట్టకేలకు నిరసనలు చేపట్టి, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంపీ ఈటలను కలిశామన్నారు. సీసీరోడ్డు మంజూరు చేయాలని కార్పొరేటర్ కమిషనర్‌ను కోరడంతో సానుకూలంగా స్పందించారన్నారు. తిరిగి రోడ్డు పనులను ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. సాయిబాబా, శివగౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్

వినతిపత్రం అందజేత



ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన వినయ్

ఆల్వాల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్న మీ సేవా సెంటర్లలో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వినయ్ మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల్లో కూడా చదువుకుని ఉద్యోగాలు లేని వారు ఉన్నారని మీ సేవా సెంటర్ల ఏర్పాటుకు రుణం మంజూరు చేయించి కేటాయించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో కూడా 5 శాతం వర్తింపజేయాలని కోరామన్నారు.

లేక్ పార్కులో మరమ్మతులు ప్రారంభం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి సఫిల్‌గూడలోని లేక్ పార్కులో మరమ్మతులు ప్రారంభించారు. కార్పొరేటర్ శ్రవణ్ సఫిల్‌గూడ చెరువు, లేక్ పార్కు దుస్థితిపై ఇటీవల చెరువును పరిశీలించిన మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. లేక్ పార్కులో చిన్నపిల్లల ఆటవస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాలు దెబ్బతినడంతో పాటు , పిల్లలు ఆడుకునే ప్రదేశంలో దెబ్బలు తగలకుండా ఇసుక కొట్టుకపోవడాన్ని గమనించి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని డీఈ మహేష్‌ను మేయర్ ఆదేశించారు. సుమారు రూ.3 లక్షలతో ఓపెన్ జిమ్ పరికరాల మరమ్మతులు చేపట్టారని కార్పొరేటర్ తెలిపారు. ఏఈ దీపక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు

హబ్సిగూడ: డివిజన్ పరిధిలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. రవీంద్రనగర్ సెయింట్ జోసెఫ్ స్కూల్ లైన్‌లో నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. దీంతో పాదచారులు, వాహనదారులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రోడ్డుపైనే నిలుస్తుడటంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. సాయంత్రమైతే దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బోనాలకు తగిన ఏర్పాట్లు చేయాలని వినతి



ఉప్పల్ : ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల పండుగకు ఆలయాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఉప్పల్ బీజేపీ ఆధ్వర్యంలో సర్కిల్ డీసీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. ఆగస్టు 4న ఉప్పల్ నల్ల పోచమ్మ బోనాలు, 8న నిర్వహించే మహంకాళి అమ్మవారి బోనాల పండుగకు దేవాలయాల వద్ద ఏర్పాట్లు కల్పించాలని కోరారు. త్వరలో ఆలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని డీసీ హామీ ఇచ్చారన్నారు. గొరిగే కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, బాలకృష్ణ, దేవేందర్ రెడ్డి, ప్రకాష్, రాజేందర్, రమేష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో హల్‌చల్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

మల్లాపూర్: కత్తి పట్టుకుని హల్‌చల్ చేస్తూ.. తిరుగుతున్న వ్యక్తిని నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మొహర్రం రోజున నాచారం ఇందిరానగర్ కాలనీకి చెందిన షేక్ ఫర్వీజుద్దీన్ (21) నాచారం వైజయంతి థియేటర్ వద్ద కత్తి పట్టుకుని తిరుగుతున్నాడు. ఈ క్రమంలో పెట్రోలింగ్ పోలీస్‌లను చూసి పారిపోతుండగా.. ఎస్సై సదరు యువకుడిని అదుపులోకి తీసుకుని, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

ఉప్పల్: భార్యతో గొడవపడి మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకానగర్ బొడ్రాయి ప్రాంతానికి చెందిన ఎర్రోల్ల రాజు (33) ఆదివారం భార్య కళ్యాణితో గొడవ జరిగింది. అనంతరం ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో అప్పటి నుంచి మద్యం సేవిస్తూ.. అదే మత్తులో బుధవారం సాయంత్రం ఇంట్లో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. విఘ్నేష్ (7), రోహిత్(4) ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మన్నికైన ఉత్పత్తులతోనే వినియోగదారులకు చేరవ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హబ్సిగూడ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన రామేశ్వరీ సిల్క్స్‌ను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. మన్నికైన ఉత్పత్తులను అందించినప్పుడే వినియోగదారుల మన్ననలను పొందగలమని అన్నారు. సిల్క్స్ వస్త్ర ఉత్పత్తుల రంగంలో తమకున్న అనుభవంతో వినూత్నంగా ఏర్పాటు చేసిన హౌజ్ ఆఫ్ వెడ్డింగ్ కలెక్షన్ కాన్సెప్ట్‌తో పట్టు, బ్రైడల్, కంచిపట్టు, పోచంపల్లి, ఉప్పాడ, గద్వాల్ రకాలతో లెహంగాస్, కుర్తీ, డిజైనర్ చీరలను అందిస్తున్నామని నిర్వాహకులు మాటేటి దుర్గం ప్రకాష్ తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి, బీజేపీ హబ్సిగూడ డివిజన్ ఇన్‌చార్జి మరినేని ఫణీంద్ర, కార్పొరేటర్ చేతనాహరీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

ఉపాధ్యాయులకు వీడ్కోలు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు బదిలీలపై వెళ్తున్న సందర్భంగా గురువారం స్థానిక 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నూతనంగా పాఠశాలకు బదిలీపై వచ్చి ఉపాధ్యాయులను సంన్మానించారు. అనంతరం వారందరితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, 25వ డివిజన్ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా..

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆరు డివిజన్లకు సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. పనిభారం ఎక్కువగా ఉండటమే కాకుండా కొన్నిసార్లు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని, ప్రభుత్వ పథకాల్లో అంగన్‌వాడీలకు ప్రత్యేక కోటా కేటాయించేలా ప్రస్తావించాలని కోరారు. ముఖ్యంగా మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మల్కాజిగిరిలో లేదని దీనివల్ల అంగన్‌వాడీ వర్కర్లే కాకుండా మహిళలు, గర్భిణీలు కూడా ఇబ్బందులు పడుతున్నారని నేరెడ్‌మెట్ నుంచి మల్కాజిగిరికి మారేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించడమే కాకుండా అర్హులైన వారికి పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ఆశావర్కర్లు

మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శారదాఈశ్వర్‌రెడ్డి

మేడిపల్లి: మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం పీర్జాదిగూడ నగరపాలక సంస్థ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పర్వతాపూర్‌లో 3వ డివిజన్ కార్పొరేటర్ శారదాఈశ్వర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు మొక్కలను నాటి అనంతరం విద్యార్థులకు పంపిణీ చేశారు.



'కాంగ్రెస్‌తోనే రైతురాజ్యం'

ఉప్పల్: రైతులకు రుణమాఫీ చేయడంపై ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఉప్పల్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలను పంచిపెట్టి, బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రైతురాజ్యం సాధ్యమన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కాంగ్రెస్ నేతలు ఆగిరెడ్డి, తౌఫిక్, రఘుపతిరెడ్డి, గిరిబాబు, జగన్, ఆగంరెడ్డి, లక్ష్మణ్, అరుణ్, అంజయ్య, శేఖర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, మహిళా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని, నూతనంగా జరగాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఇచ్చి, అక్రమ నిర్మాణాలను అరికట్టాలని విన్నవించారు. నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జగదీష్‌గౌడ్, మేకల రాముయాదవ్, అమీనుద్దీన్, నరేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.